# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

'బతుకమ్మ - దసరా' పండుగల ప్రత్యేక సంచిక - 2021




## పది శతాబ్దాల వేడుక..
## 'బతుకమ్మ' పండుగ


జై తెలంగాణ !
జై జై తెలంగాణ !!
బతుకమ్మ దసరా పండుగల శుభాకాంక్షలు
దావ వసంత సురేష్
ZP ఛైర్‌పర్సన్,జగిత్యాల జిల్లా

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

బతుకమ్మ-దసరా ప్రత్యేక సంచిక

అక్టోబర్ - 2021


సంపాదకులు:

**సిహెచ్.వి. ప్రభాకర్ రావు**

ఫోన్: 9391533339

ప్రచురణకర్త :

**వి.నర్సింగం**

ఫోన్: 9440587731

సంపాదక బృందం:

**సిరిసిల్ల రాజేందర్ శర్మ**

ఫోన్: 93484 22113

**వనమాల గంగాధర్**

ఫోన్: 8106194733

గౌరవ సలహాదారులు:

**బి.ఎస్. రాములు.**

**అయాచితం శ్రీధర్.**

**రాపోలు ఆనంద భాస్కర్.**

చిరునామా:

26-6-206, పద్మనగర్, జగిత్యాల

505327.జిల్లా: జగిత్యాల, తెలంగాణ.

http://prajamantalu.com

e-mail : rajamantalu@gmail.com

Printed & Publishe by V.Narsingam on behalen of ch.v.Prabhakar Rao, 6-6-206, Padma Nagar, Jagtial and Printed at Sri Sharadha Printing Press, jagtial. Editor: Ch.V.Prabhakar Rao. RNI No.TELTEL 01938/2019

















## శివ శక్తి స్వరూపమే..

# దుర్గామాత

**సృష్టియందు గల చరాచర వస్తువులన్నిటి యందు మానవాతీత మైన, అనిర్వచనీయ మైన, అవ్యక్త మైన, చైతన్య వంతమైన, ఏదో తెలియని ఒక మహా అద్భుత శక్తి ఒకటి దాగి ఉంది. ఈ సృష్టి యందుగల జ్యోతిర్మండల, గాలి, నిప్పు, నీరు, భూమి ఇవన్ని మానవ నిర్మితాలు మాత్రము కావు అన్నది అందరూ ఆమోదించే విషయం. ఆశక్తినే మహేశ్వరిశక్తి గాను, పరాశక్తి గాను, జగన్మాత శక్తి గాను పలు రూపాల్లో పిలుస్తూ ఉపాసిస్తూ ఉంటారు. ఈశక్తి లేకుంటే శివుడైనా ఏమి చెయ్యలేడని శివునియొక్క శక్తి రూపమే "దుర్గ" యని ఆది శంకరాచార్యులు అమృత వాక్కులో పేర్కొన్నారు.**

ఈ అమ్మవారు రాత్రిరూపం గలది అని పరమేశ్వరుడు పగలు రూపం గలవాడు అని ఈ దేవిని రాత్రి సమయాల్లో అర్చిస్తే సర్వ పాపాలు నాశన మౌతాయని సమస్త కోరికలు సిద్ధిస్తాయని మత్స్య పురాణం తెలియచేస్తున్నది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి దేవీ నవరాత్రులు జరుపు కుంటారు. ఎనిమిదవ రోజు.. అంటే ఆశ్వయుజ అష్టమి దుర్గాష్టమి లేదా మహాష్టమి పర్వదినం. ఈ నవరాత్రుల పుణ్య దినాలలో ఏనోట విన్నా ఈ దుర్గాసప్తశతి శ్లోకం వింటూ ఉంటాము.

"సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధకే,
శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తుతే"...

మహాష్టమి నాడు 64 యోగినులను, దుర్గాదేవి రూపాలైన అష్ట నాయికలను అర్చిస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో బ్రాహ్మణి, మహేశ్వరి, కామేశ్వరి, వైష్ణవి, వరాహి, నార్సింగి, ఇంద్రాణి, చాముండి - అనే ఎనిమిది శక్తి రూపాలను కొలుస్తారు. రక్తబీజగా పూజిస్తారు. దుర్గాష్టమి నాడు దుర్గాదేవిని పూజిస్తే ఈతి బాధలు తొలగి పోతాయని విశ్వాసం. నవరాత్రుల్లోని తొలి మూడు రోజులు దుర్గా రూపాన్ని ఆరాధించి అరిషడ్వర్గాలను, తర్వాత మూడు రోజులు లక్ష్మీరూపాన్ని ఆరాధించి సిరి సంపదలను, చివరి మూడు రోజులలో సరస్వతి రూపాన్ని ఆరాధించి జ్ఞానాన్ని పొందాలని ఆధ్యాత్మిక నిపుణులు చెపుతారు. మొదటి మూడు రోజుల్లో దుర్గాదేవి పూజించలేని భక్తులు దుర్గాష్టమి, విజయ దశమి నాడు పూజ చేస్తే అష్టైశ్వర్యాలతో కూడిన సుఖ జీవితం లభిస్తుంది. రాక్షసుడు మహిషాసురుడిని కాళికా దేవీ సంహరించి నందుకు గుర్తుగా మనం ఈ నవరాత్రి వేడుకలు జరుపు కుంటాం.



దుర్గాష్టమి రోజును ఆయుధాలకు, వాహానాలకు పూజ చేస్తారు. పాండవులు అరణ్యవాసం ముగించి, అజ్ఞాతవాసానికి వెళ్తూ జమ్మిచెట్టు కొమ్మల మధ్య తమ ఆయుధాలను దాచి వెళ్లారు. తిరిగి వచ్చిన తర్వాత అర్జునుడు జమ్మిచెట్టుపై దాచిన ఆయుధాలను తీసి, పూజించి, ఉత్తర గోగ్రహణ యుద్ధం చేశాడు. శత్రువులను జయించి విజయు దయ్యాడు. ఆయుధాలకు రక్షణ కల్పించిన జమ్మిచెట్టు పవిత్రతను సంతరించుకుంది. కనుకనే ఇప్పటికీ జమ్మి చెట్టుకు భక్తిగా పూజలు చేస్తారు. దుర్గతులను నివారించే మహాశక్తి స్వరూపిణి అమ్మవారు దుర్గా దేవి. ఈ రూపంలో అమ్మవారు దుర్గముడు అనే రాక్షసుడిని సంహరించి నట్లు పురాణాలు చెబుతున్నాయి. పంచ ప్రకృతి మహా స్వరూపాలలో దుర్గాదేవి మొదటిది. భవ బంధాలో చిక్కుకున్న మానవుడిని మాత అనుగ్రహించి మోక్షం ప్రసాదిస్తుంది. కోటి సూర్య ప్రభలతో వెలిగొందే అమ్మని అర్చిస్తే శత్రుబాధలు నశిస్తాయి. విజయం కలుగుతుంది. సకల గ్రహ బాధలు తల్లి నామం జపిస్తే తొలగి పోతాయి. ఆరాధకులకు అమ్మ శీఘ్ర అనుగ్రహ కారిణి, ఎర్రని బట్టలు పెట్టి, ఎర్ర అక్షతలు, ఎర్ర పుష్పాలతో అమ్మను పూజించాలి. దుర్గా సూక్తం పారాయణం చెయ్యాలి. "**ఓం దుం దుర్గాయైనమః:**" అనే మంత్రాన్ని పఠించాలి. పులగాన్నం నివేదనం చెయ్యాలి, దుర్గ, లలిత అష్టోత్తరాలు పఠించాలి. ఈ దినం "ఆయుధ పూజ లేక అస్త్రపూజ " చేయడం సాంప్రదాయం. ఈ రోజున వృత్తి ఉద్యోగాల్లో స్థిరపడిన వారు అస్త్ర పూజ చేస్తారు. తమ వృత్తికి సంబంధించిన సామగ్రిని, ముఖ్యమైన పరికరాలను అమ్మవారి ఎదుట ఉంచి పూజ చేస్తారు. తమ పిల్లలకు తల్లిదండ్రులు ఇతర రోజుల కంటే దుర్గాష్టమి లేదా విజయ దశమి రోజున విద్యాభ్యాసం చేయించడం ఉత్తమంగా భావిస్తారు. ఈ రోజుల్లో చిన్నారుల చేత "ఓంకారం" రాయించి విద్యాభ్యాసం చేయిస్తే చదువు బాగా వస్తుందని విశ్వసిస్తారు. వ్యాపారులు తమ షాపులు, వ్యాపార సంస్థలను పూవులతో అలంకరించుకుని దుర్గాదేవి పూజ చేసుకుంటారు. వాహనాలను శుభ్ర పరచుకుని పసుపు, కుంకుమ పూలతో అలంకరించుకుని పూజిస్తారు. నిమ్మ కాయ, కొబ్బరి కాయ, గుమ్మడి కాయలతో దిష్టి తీసి కొడ తారు. కొత్తగా వ్యాపారం దుర్గాష్టమి, విజయ దశమి రోజుల్లో ఆరంభించడం శుభ సూచకంగా భావిస్తారు. సమీపంలోని అమ్మవారి ఆలయాలను సందర్శించడం చేయాలి. శక్తి కొలది గోమాతకు ఏదైనా గ్రాసం తినిపించి మూడు ప్రదక్షిణలు చేస్తే మంచిది.



- రామకిష్టయ్య సంగన భట్ల
94405 95494




శ్రీవాణి జూనియర్ కళాశాల
జగిత్యాల





# నవదుర్గల ప్రత్యేకతలు

*శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాత ఆరాధన అనాదిగా ఆచరణలో ఉంది. దేవీ భాగవతం, దుర్గ సప్తశతి, మార్కండేయ పురాణంలో దుర్గాదేవి మహాత్మ్యం వర్ణించ బడింది.*

**"ప్రథమం శైలపుత్రి ద్వితీయం బ్రహ్మచారిణీ!**
**తృతీయం చంద్రఘంటేతి కూష్మాండేతి చతుర్థకమ్!**
**పంచమం స్కంద మాతేతి షష్ఠం కాత్యాయనీతి చ!**
**సప్తమం కాలరాత్రీతి మహాగౌరీతి చాష్టకమ్!**
**నవమం సిద్ధిధాత్రీచ నవర్గా: ప్రకీర్తితా!**
**ఉక్తాన్యేతాని నామాని బ్రాహ్మణ ఇవ మహాత్మా!!**

దేవిని తొమ్మిది అవతారాలు తొమ్మిది దినాలు రూపానికి తగిన అలంకారాలతో, ఆయుధాలతో నవదుర్గలుగా ప్రత్యేకంగా పూజించడం సంప్రదాయం. మొదటి రోజున "శైలపుత్రి" దుర్గ... నంది తన వాహనంగా కుడిచేత త్రిశూలాన్ని, ఎడమచేత పద్మ పుష్పాన్ని ధరించి దర్శనమిస్తుంది. రెండో రోజు "బ్రహ్మచా రిణి"గా దేవి తపోదీక్షాధారిణిగా కన్పిస్తుంది. కుడిచేత రుద్రాక్షమాల ఎడమ చేత కమండలం ధరించి ఉంటుంది. మూడో రోజున దేవి చంద్రఘంట"గా పిలువ బడుతుంది. ఈ రూపంలో దేవి దశహస్తాలతో, పది చేతులలో పది ఆయుధాలు, సింహ వాహనారూఢయై ఉంటుంది. షోడశ కళల చంద్రుని రూపం. ఈ దినాన ఘంట రూపంలో కన్పిస్తుంది.

నాలుగో రోజున "కూష్మాండ దేవి"గా కొలుస్తారు. సృష్టికి మూలమై చిద్విలాసంతో సృజించినది కావున వర్తుల విశ్వాన్ని కూష్మాండం, గుమ్మడికాయతో పోలుస్తూ, కూష్మాంగా వ్యవహరిస్తారు. ఎనిమిది చేతులు కలిగి ఉండే రూపమై నందున "అష్టభుజ" అని కూడా అంటారు. ఏడు చేతుల్లోనూ వరుసగా విల్లు, బాణం, పద్మపుష్పం, అమృతకలశం, చక్రం గద ధరించి, ఎనిమిదో చేతిలో రుద్రాక్షలతో దర్శనమిస్తుంది. ఈదేవికి కూష్మాండం బలికి ప్రముఖ స్థానమై, ప్రీతికరమైనది ఐదవ రోజున "స్కందమాత"గా దేవి లోకి ఖ్యాతి చెందింది. కార్తికేయుని తల్లిగా నాలుగు చేతులతో, ఊర్ధ్వ దక్షిణ హస్తంలో స్కంద బాలుడిని, అధో దక్షిణ హస్తంలో పద్మాన్ని, ఊర్ధ్వ వామ హస్తంలో ఆశీర్వాద ముద్రను, అధో దక్షిణ హస్తంలో పద్మాన్ని ధరించి, పద్మంపై కూర్చుని ఉంటుంది.



అందుకే "పద్మాసనం"గా పిలుస్తారు. సింహవాహనగా దర్శనమిస్తుంది. ఆరవ రూపంకాత్యాయని" బంగారు ఛాయతో తళు కులీను తుంటుంది. కుడి చేయి ధైర్యస్థైర్యాలను కలిగించే రీతిలో ఉంటుంది. దిగువనున్న చేయి వరదాయిని ముద్రలో, ఎడమ వైపున ఉన్న పై చేయి ఖడ్గం, దిగువనున్న చేతిలో పద్మం ధరించి, సింహవాహనయై దర్శనమిస్తుంది. దురర్గాదేవి ఏడో రూపం "కాళరాత్రి" నల్లగా, జుట్టు విరబోసుకుని, మెరుపుల కాంతులు వెదజల్లే గళముతో త్రినేత్రపై, నిప్పులు కక్కుతూ, జ్వాజ్వాల్య మానంగా గార్ధభ వాహనాసీనయై, చతుర్భుజాలతో దర్శనమిస్తుంది.

ఎనిమిదవ రూపంలో "మహాగౌరి"గా ధవళ ధావళ్య విలాసినిగా దేవి ప్రశాంతత, పరి శుద్ధతకు ప్రతీకగా, శ్వేత వస్త్రాంబర ధారిణియై నంది వాహనంగా, కుడివైపు పైచేత సర్వభయ హారిణి దిగువ చేత త్రిశూల ధారిణిగా ముద్రలు కన్పిస్తుంటే, ఎడమ వైపున ఢమరుకం పైచేత, దిగువ చేత వరదాయిని ముద్రతో దేవి దర్శనమిస్తుంది. తొమ్మిదవ దినాన మహర్నవమి నాడు నవదుర్గలలో చివరి రూపమైన "సిద్ధిధాత్రి"గా– విజయాన్ని సిద్ధింప చేసే శక్తిశాలినిగా, దర్శనమిస్తుంది.



– రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఆంధ్రజ్యోతి దినపత్రికకు 19వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు మరియు శ్రేయోభిలాషులకు బతుకమ్మ మరియు దసరా శుభాకాంక్షలు
The Pride of Telangana & Maharashtra
Alphores
e-techno school
BUILDING FUTURE ICONS
Nursery - X Class
Krishna Nagar, JAGTIAL
Best in IIT & NEET Foundation
- Dexterous Faculty with Eminence & Prominence
- Procedural Conduct of Olympiads & Competitive Exams
- Catchy Laboratories & Library with Excellent Literary Works
- Highly Defined Computer Labs
- Featured Emphasis for Art, Craft & Choreography
Scrupulous Supervision to raise EXCELLENCE to be EXCELLENT
- Encouragement for Perfection in Sports & Games for Indoor & Outdoor Games.



Alphores
School of Gen Next
Nursery - X Class
Vidya Nagar, JAGTIAL
- Expert Faculty & Advanced Teaching System
- Success Assured with Result Oriented Education
- Spacious Playground, Inspring Coaching for Indoor & Outdoor Games
- Highly Defined Computer Labs
- Featured Emphasis for Art, Craft & Choreography
- Periodical Review & Procedural Analysis & Assessment

ALPHORES INSPIRES THE NATION WITH 3 SPECTACULAR
inspire
inspire awards-manak
3 Most Meritorious ALPHORESIANS projects (KNR 2 & JGL 1) have got selected to the NATIONAL INSPIRE MANAK AWARDS SCHEME



Dr.V.Narender Reddy, Chairman
JAGTIAL # 92469 34445 | KARIMNAGAR # 91331 86444



## పదిశతాబ్దాల వేడుక..

# బతుకమ్మ పండుగ...!

**బతుకమ్మ పండుగను తెలంగాణా రాష్ట్రంలో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. వేములవాడ లో మాత్రమే ఆశ్వయుజ శుద్ధ సప్తమి రోజున జరుపుకుంటారు. ఈ బతుకమ్మ పండుగ లేదా సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందు కొన్ని ప్రాంతాల్లో దసరా పిదప రెండు రోజులకు మరికొన్ని ప్రాంతాల్లో జరుపుతారు. సెప్టెంబరు, అక్టోబరు నెలలు తెలంగాణ ప్రజలకు పండుగల నెలలు. పండుగ సంబరాలు, కుటుంబ కోలాహలాలు, ఆత్మీయుల కలయకలతో నిండిపోయుంటుంది. ఈ పండుగలలో ఒకటి బతుకమ్మ పండుగ, మరియొకటి దసరా విజయ దశమి. బతుకమ్మ పండుగ తెలంగాణకు ప్రాంతానికి మాత్రమే ప్రత్యేకమయిన పండుగ. ఇది తెలంగాణ సాంస్కృతికి ప్రతీక.**

ఈ పండుగ సందర్భంగా బాలికలు యువతులు మహిళలు రంగు రంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు కొనసాగిన బతుకమ్మలను బావిలో చెరువులో వాగు లలో నదీ నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, పురాణ చారిత్రక నేపథ్యాలన్ని వివరిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.

### పుష్పాల ఆరాధనే బతుకమ్మపండుగ విశిష్టత.

పువ్వులను దేవుళ్ళకు భక్తితో సమర్పించి పూజలు చేస్తారు అందరూ. అయితే పూలనే దేవతగా భావించి పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణాప్రాంత విశిష్టత . తెలంగాణా రాష్ట్రములోని అన్ని ప్రాంతాల్లోముఖ్యంగా వరంగల్ ఖమ్మం వేములవాడ సిరిసిల్ల జగిత్యాల రాయికల్ కోరుట్ల కరీంనగర్ నిజామాబాద్ తదితర చోట్లలో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగను వైభవంగా జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండుగ. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక బతుకమ్మ పండుగ.

తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను గత పది శతాబ్దాలుగా జరుపుకుంటున్నారు. ఈ సాంప్రదాయం ఎలా మొదలైందో చెప్ప డానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నాడు నవాబులు,రజాకార్లు భూస్వాముల పెత్తందారీ తనంలో నలిగిపోయిన తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. నాటి దొరల అకృత్యాలకు నలిగిపోయిన వారిని,ఆ బాధలు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న వారిని తలచుకొని తోటి మహిళలు విచారించేవారు.. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. పాటల వెనుక ఉండే మర్మం ఇదే..

ఈ పండుగ వర్షాకాలపు చివరిలో, శీతాకాలపు తొలి రోజులలో వస్తుంది. అప్పటికే వర్షాలతో చెరువులన్నీ మంచి నీటితో నిండి ఉంటాయి. రకరకాల పువ్వులు రంగు రంగులలో ఆరుబయలలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు పూలు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. బంతి, చేమంతి, నంది వర్ధనం లాంటి పూలు పూచే సమయం. సీతాఫలాలు కూడా ఈ సమయంలో ఒక పెద్ద

ఆకర్షణ. జొన్న పంట కోతకు సిద్ధంగా తలలూపుతూ ఉంటుంది. వీటన్నింటి నేపథ్యంలో తెలంగాణ ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమయిన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండుగను జరుపుకుంటారు

తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైంది. ఉద్యమ సందర్భాల్లో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ అస్థిత్వాన్ని సగర్వంగా ప్రకటించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కై జరిగిన ఉద్యమ తరుణంలో బతుకమ్మ పండుగకు ప్రాధాన్యత మరింతగా పెరిగిపోయింది.

ఈ బతుకమ్మ పండుగ వెనుక చాల కథలు ఉన్నాయి. బాగా ప్రాచుర్యంలో ఉన్నది . ఒక బాలిక ఆనాటి భూస్వాముల ఆకృత్యాలను భరించలేక ఆత్మహత్య చేసుకుంటే, ఆమెను ఆ ఊరి ప్రజలు చిరకాలం "బతుకమ్మా !" అని దీవించారట.అందుకనే ఈ పండుగ స్త్రీలకు సంబంధించినది.ఆ బతుకమ్మను కీర్తిస్తూ జరుపుకునే పండుగ. స్త్రీలందరూ ఈ సందర్భంగా ఎటువంటి ఆపదల పాలు కారాదనీ, పతులు మరియు కుటుంబం చల్లగా ఉండాలనీ గౌరమ్మను ప్రార్ధిస్తారు.ఇంకొక వృత్తాంతములో దక్షిణ భారతాన్ని పాలించిన చోళ వంశ చక్రవర్తి ధర్మాంగదుడు భార్య సత్యవతి పుణ్యదంపతుల కు సంతానము లేక అనేక పూజలు పునస్కారాలు చేయగా ఈయన భార్య గర్భవతియై లక్ష్మీ దేవి అనుగ్రహముతో ఒక కూతుర్ని కన్నది. పసిబిడ్డైన ఆమె అనేక గండములను గట్టెక్కినది కావున ఈమె తల్లితండ్రులు బతుకమ్మా అని నామకరణము చేసారు. అప్పటినుండి బాలికలు యువతులు మంచి భర్తను ప్రసాదించాలని కోరుతూ బతుకమ్మను కొలవడము ఆనవాయితీ అయ్యిందని ఈ కథ చెబుతుంది.

బతుకమ్మ పండుగ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో బతుకమ్మ పండుగ వచ్చి, భూమితో,పూలతో జలంతో, మానవ అనుబంధాన్ని ఆనందంగా జరుపుకునేలా చేస్తుంది. ఈ సంబరాలు జరుపుకునే స్త్రీలు పసుపు తో గౌరమ్మ "బొడ్డెమ్మ" ను చేసి బతుకమ్మతో పాటూ నిమజ్జనం చేస్తారు. మహిళల ఐక్యత కు ప్రకృతి ఆరాధనకు ప్రతీక గా బతుకమ్మ పండుగ నిలుస్తోంది.

ఈ పండుగ వర్షాకాలపు చివరిలో, శీతాకాలపు తొలి రోజులలో వస్తుంది. అప్పటికే వర్షాలతో చెరువులన్నీ మంచి నీటితో నిండి ఉంటాయి. రకరకాల పువ్వులు రంగు రంగులలో ఆరుబయలలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు పూలు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. బంతి, చేమంతి, నంది వర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సమయం. సీతాఫలాలు కూడా ఈ సమ యంలో ఒక పెద్ద ఆకర్షణ. సీతాఫలాన్ని పేదవాని ఆపిల్ అంటారనేది తెలిసినదే. అలాగే జొన్న పంట కోతకు సిద్ధంగా తలలూపుతూ ఉంటుంది. వీటన్నింటి నేపథ్యంలో తెలంగాణ ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమయిన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండుగను జరుపుకుంటారు.



**బతుకమ్మ చరిత్ర..**

తెలంగాణ ప్రాంతాన్ని రాష్ట్రకూట రాజులు పరిపాలించేకాలంలో వారి వద్ద వేములవాడ చాళుక్యలు సామంతులుగా ఉండేవారు. చోళులకు, రాష్ట్రకూటులకు యుద్ధం జరిగినప్పుడు ఈ చాళుక్యలు రాష్ట్రకూటులకు మద్దతుగా నిలిచారు. క్రీస్తు శకం 973లో ఈ చాళుక్యరాజైన తైలపాదు రాష్ట్రకూటులకు చివరి రాజుగా వ్యవహరించిన కర్కుడిని హతంచేసి కళ్యాణి చాళుక్య రాజ్యాన్ని నెలకొల్పాడు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతాన్ని తైలపాదు రాజే పరిపాలించేవాడు. క్రీస్తు శకం 997లో తైలపాదు మరణించడంతో అతని కుమారుడైన సత్యాస్రాయుడు రాజపీఠాన్ని అధిష్టించాడు. ఆనాడు వేములవాడ లో ప్రసిద్ధి చెందిన రాజరాజేశ్వర ఆలయం ఉండేది. ఆపదల్లో ఉండేవారికి రాజరాజేశ్వరస్వామి అండగా ఉంటాడని అప్పటి ప్రజలు నమ్మేవారు. ప్రజలే కాదు చోళరాజు పరాంతక సుందరచోళా కూడా రాష్ట్రకూటుల నుంచి ఆపద తలెత్తినప్పుడు రాజరాజేశ్వరస్వామి భక్తుడిగా మారిపోయాడు. రాజరాజేశ్వరుడే తమను కాపాడినాడని నమ్మిన పరాంతక సుందర చోళ తన కుమారుడికి రాజరాజ అని నామకరణం చేశాడు. ఆ రాజరాజ చోళుడే క్రీస్తు శకం 985 నుంచి 1014 వరకు ఈ రాజ్యాన్ని పరిపాలించాడని చరిత్ర చెబుతోంది. అతని కుమారుడైన రాజేంద్రచోళ సత్యాస్రాయపై జరిపిన యుద్ధానికి సేనాధిపతిగా వ్యవహరించి విజయం సాధించాడు. ఆ విజయానికి గుర్తుగా రాజేశ్వర ఆలయం లోని భారీ శివలింగాన్ని తన తండ్రికి బహుమతిగా ఇచ్చాడు. తన కొడుకు ఇచ్చిన శివలింగం కోసం క్రీస్తు శకం 1006లో తంజావూరు లో ఓ ఆలయ నిర్మాణాన్ని చేపట్టాడు రాజరాజ చోళ. సా.శ 1010లో నిర్మాణం పూర్తయ్యాక వేములవాడ నుంచి శివలింగాన్ని పార్వతి నుంచి వేరుచేసి తంజావూరు బృహదీశ్వరాలయంకు తరలించాడు. ఈసంఘటన నాటి తెలంగాణ ప్రజల మనసులను కలచివేసింది.తమ బృహదమ్మ(పార్వతి) నుంచి శివలింగాన్ని వేరుచేసినందుకు గాను, తమ దు:ఖాన్ని చోళరాజులకు






తెలియజేస్తూ మేరు పర్వతంలా పూలను పేర్చి బతుకమ్మగా పూజలను నిర్వహించడం మొదలుపెట్టారు తెలంగాణవాసులు. అలా ప్రతి ఏడాది బతుకమ్మను జరపడం ఆనవాయితీగా మార్చుకున్నారు. దాదాపు వెయ్యి సంవత్సరాల నుంచి బతుకమ్మను తెలంగాణవాసులు జరుపుకుంటున్నారు. బతుకమ్మ పేరు కూడా బృహదమ్మ నుంచి వచ్చినదే అని చరిత్రకారుల అభిప్రాయము. బతుకమ్మ సందర్భంగా గౌరమ్మను పసుపు రంగు పూలతో పేర్చి తొమ్మిది రోజుల పిల్లలు పుట్టిన వెంటనే పెంట మీద వేసి తెచ్చుకుని 'పెంటమ్మ లేదా పెంటయ్య' అని పేరు పెట్టుకుంటారు. మరి కొందరు పుట్టినపిల్లల్ని ఎవరికైనా ఇచ్చి 'బిచ్చంగా' తిరిగియ్యమని కోరుకుంటారు. అట్లా తీసుకున్న పిల్లలకు 'భిక్షపతి,భిక్షమ్మ'లని పేరు పెట్టుకుంటారు. ఇట్లాంటి సందర్భాల్లోనే బతుకనిపిల్ల బారెడనే సామెతలు పుట్టాయి. పిల్లల్ని బతికించమనే వేడుకునే దేవతల్లో మన బతుకమ్మ ఒక దేవత. ఆ దేవత వరాన బతికితే బతుకమ్మ,



అందుకే తల్లికంత గౌరవం. అమ్మతనం మీద భక్తి. ఆ భక్తే అమ్మదేవతలను కల్పించింది. పూజించింది. అమ్మదేవతల పూజల్లో ఒక ఆరాధనా రూపమే మన బతుకమ్మ.

**వివిధ మతాలలో బతుకమ్మ ఆరాధన..**

బౌద్ధమతంలో ముందు చెడ్డదేవతగా,






పాటు ఆటపాటలాడి పూలను నీటిలో వదులుతారు. శివుడు లేని పార్వతి గురించి పాటలగా పాడుతూ బతుకమ్మను జరుపుకుంటున్నారు తెలంగాణ వాసులు.

బతుకమ్మ పండుగ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో బతుకమ్మ పండుగ వచ్చి, భూమితో, జలంతో, మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకోబడుతుంది. ఈ సంబరాలు జరుపుకునే వారం అంతటా స్త్రీలు "బొడ్డెమ్మ" మట్టితో చేసే దుర్గాదేవి బొమ్మ ను బతుకమ్మతో పాటూ చేసి నిమజ్జనం చేస్తారు.

జానపదులు తమసంతానం దక్కాలని అమ్మదేవతలకు మొక్కుకునే ఆనవాయితీచాలా పురాతనమైనది. పుట్టిన పిల్లలను చల్లగా చూడమని అమ్మదేవతల ముందు కట్టిన ముడుపులు, మొక్కులు చెల్లించుకుంటారు. కొంతమంది పుట్టినపిల్లలు పుట్టినట్లు చనిపోతుంటే, బతుకయ్యలని పేర్లు పెట్టుకుంటారు.

ఈ పూలపండుగ బతుకమ్మ ఎంగిలిపూలతో మొదలుపెట్టి సద్దులబతుకమ్మతో ముగిసిపోతుంది. బొడ్డెమ్మపండుగ నాడు 'బొడ్డెమ్మ బొడ్డెమ్మా వలలో , బిడ్డాలెందారే.. వలలో' అని పాడే పాట సంతానం గురించే కదా. నాటి రోజుల్లో నీళ్ళాడే (ప్రసవ) సమయాల్లో శిశు మరణాలు జాస్తిగా వుండేవి. నీటిరేవులే ఆనాటి తల్లులకు ప్రసూతి స్థలాలు. నీళ్ళల్లో ప్రసవించే సమయంలో తల్లులు తమసంతానం బతికినందుకు ప్రతీకగా నీటివారన పెరిగే తంగేడు, గునుగు పూలముద్దలను నిమజ్జనం చేసివుంటారు. ఆ తల్లుల ఆచారమే బతుకమ్మ పండుగగా మారి వుంటుంది. ఇది తెలంగాణా ప్రాంతానికే చెందడం మన గొప్ప సంస్కృతికి సాక్ష్యం. ఎవ్వరికన్న ఐదారుగురు కన్నా ఎక్కువమంది పిల్లలుంటే ఆ తల్లిని గౌరవించేవాళ్ళు. మానవజాతి పిల్లల వల్లనే కదా ఇన్ని వేలయేండ్లుగా మనగలిగింది.

పిల్లల్ని ఎత్తుకపోయే రాక్షసిగా పిలువబడ్డ హారీతి బుద్ధునివల్ల మంచిదానిగా, పిల్లల్ని రక్షించే దేవతగా మారిపోయింది. ఆమెనే పిల్లలదేవతగా కొలుస్తారు. పుట్టిన తమ పిల్లలు బతుకాలని, రోగాలు, రొష్టులు లేకుండ వుండాలని హారీతిని ఆరాధించేవారు. ఈ దేవతను గురించి బౌద్ధ జాతక కథల్లో చదువగలం. వివిధ చారిత్రకదశల్లో ఈ దేవత విగ్రహాలు వేర్వేరు రూపాల్లో అగుపిస్తున్నాయి. చాళుక్యులు తమను తాము హారీతిపుత్రులుగా శాసనాల్లో చెప్పుకున్నారు. 2వ శతాబ్దంలో ఇక్ష్వాకుల కాలం నుండి హారీతి శిల్పాలు కనిపిస్తున్నాయి. 12వ శతాబ్దం దాకా శాసనాల్లో హారీతిపేరు ప్రస్తావించబడ్డది. పిల్లల్ని బతికించే దేవత హారీతినే బతుకమ్మగా భావించినారేమో.

కూష్మాండిని దేవతకు ప్రతీకగా గుమ్మడిపువ్వును పూజించే ఆచారమే బతుకమ్మ పండుగగా మారిందని కొందరి అభిప్రాయం. మన పూర్వీకులు ఇనుము-ఉక్కు తయారీకి తంగేడుచెక్కను వాడేవారు. తోలు తయారీకి తంగేడు చాలా అవసరమని అందరికి తెలుసు. గునుగుఆకులకు పూలకు నీళ్ళను శుభ్రపరిచే గుణముంది. తమకు నిత్యజీవితాసరాలైన తంగేడు, గునుగుపూలతో మనపూర్వీకులు తమ అమ్మదేవత(కూష్మాండిని?)ని పూజించే రూపమే పరిణామంలో జాతరగా మారి వుంటుంది. గునుగు, తంగేడుపువ్వులతో కొప్పురం రూపంలో పూలబతుకమ్మను పేర్చి, శిఖరం లేదా సిగమీద గుమ్మడి పువ్వుంచి, పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. పూజపువ్వులను




తొక్కుట్లవెయ్యని ఆచారమే బతుకమ్మలను నీళ్ళలో వదిలే సంప్రదాయమైంది.

దసరా పండుగ సందర్భంగా కొలిచే హిందూదేవత నవదుర్గారూపాల్లో కూష్మాండిని ఒకటి. ఎనిమిదవ రోజున కూష్మాండినిని అర్చిస్తారు. అదేరోజు బతుకమ్మలాడుతారు. కొన్ని ప్రాచీన ఆచారాలను మతాలు స్వంతం చేసుకున్న క్రమం చరిత్రలో కనిపిస్తుంది మనకు. తొలి మొలకలను, తొలిపూతను కొలిచే ఆచారం గిరిజనులదే. పువ్వంటే రేపటి ఫలమని వాళ్ళకు తెలుసు. ఆడపిల్లలను, పువ్వుల్ని కొలిచే పండుగే మన బతుకమ్మ. ఈ పండుగకు మతం లేదు.కులం లేదు అయితే కాలక్రమేణా మతాచారాలు కులాచారాలు రుద్దబడ్డాయి. మన ప్రాంతంలో కూష్మాండిని ఆరాధన జైనులవల్ల వచ్చింది. జైనమతాను యాయులైన కాకతీయులవల్ల ప్రోత్సహించబడ్డది. జైనంలో 22వ తీర్థంకరుని శాసనదేవత, యక్షిణి అంబిక(అంబొఅమ్మ) లేదా కూష్మాండిని (గుమ్మడితీగె, గుమ్మడిపువ్వు). ఈమె ప్రతిమాల క్షణంలో చేతుల్లో ఫలాలతో, ఇద్దరు పిల్లలతో, మామిడిచెట్టుకింద కూర్చొనివున్నట్టు వుంది. అంబిక కూడా ఒక అమ్మదేవతే. ఈ దేవతలకు ప్రతిమారూపాలు క్రీ.శ. 5వ శతాబ్దం నుంచే కల్పించబడ్డాయి. అంతకు ముందున్నట్టు చారిత్రకాధారాలు లేవు.

బతుకమ్మల తయారీలో కూడా చాలా భేదాలు కనిపిస్తాయి. బతుకమ్మలు స్తూపాల ఆకారంలో వుంటాయి. లింగాల తయారీలో కూడా ఇటువంటి సంప్రదాయముందని చాలాచోట్ల చెప్పబడింది. పూర్వం బౌద్ధులు తమ ఆరాధనలో భాగంగా చేసుకున్న స్తూపాలను పూలు, మట్టి, ఇసుక, పేడ, రాయి, ఇటుకలతో తయారుచేసుకునే వారు. బౌద్ధభిక్షుకులు నిరంతరం ప్రయాణిస్తుండడం వల్ల స్తూపారాధనకు తమకు దొరికిన వాటినే స్తూపాలుగా చేసుకుని బుద్ధునికి ప్రతీకగా నమస్కరించేవారు. పూలు, ఇసుక, మట్టి, పేడ స్తూపాలను నీటిలో కలిపేసేవారు మర్యాదగా. వాళ్ళు తిరుగాడిన ప్రదేశాల్లోని ఎన్నో వాగులు, ప్రవాహాలు భిక్కేరులుగా పిలువబడుతున్నది ఒక్క తెలంగాణలోనే. అందువల్లనే తొలుత బౌద్ధులైన గిరిజనులు, వనజనులు ఈ ఆచారాన్ని కొనసాగించి వుంటారు. దానికి వారి కోరికలు మన్నించిన అమ్మదేవతకు ప్రతీకగా తర్వాత చేసుకుని వుంటారు. పిదప కాలాల్లో వచ్చిన మతపరిణామాలవల్ల ఈ దేవతలను తమ, తమ మతదేవతలుగా చేసుకున్నారు. ఆ దేవతలే బౌద్ధంలో హారీతిగా, జైనంలో ఆమ్రకూష్మాండినిగా, హిందూమతంలో అంబికగా పూజింపబడ్డారు. తెలంగాణాలో అతిప్రాచీనమైన అమ్మదేవతల ఆరాధనమే తల్లుల రూపంలో ఏ దేవత వచ్చినా తమ దేవతల్లో కలుపుకున్న సంప్రదాయమే బతుకమ్మ జాతరగా నిలిచిపోయింది. దసరా పండుగతో బతుకమ్మను కలుపడం, అమ్మదేవతలను కాకుండా పితృదేవతలను పూజించే ఆచారంగా మారడం 'పెత్రామాస'(పితృ అమావాస్య)ను ఈ పండుగలో చేర్చడం తర్వాతి కాలాల్లో వచ్చిన పరిణామమే. జనపదుల ఆచారాలు చాలా ప్రాచీనమైనవి. అవి వేలయేండ్ల పూర్వపువి. ఒక్కో జాతికి, ప్రాంతానికి పరిమితమైనవి. బతుకమ్మ మనకు, మన తెలంగాణాకే పరిమితమైంది. ప్రపంచంలో మరెక్కడా లేని పూలపూజ మన సంస్కృతి. బతుకమ్మ జానపదుల పండుగ. బతుకమ్మ ఆటలో గుస్సాడి నృత్యం, చప్పట్లలో జానపదుల పాట, ఆటల కలయిక మనమూలాలను ఎరుకపరిచే మంచి సంప్రదాయం. బతుకమ్మ అచ్చతెలుగు మాట. శతాబ్దాలుగా విలసిల్లుతున్న మన ఘనచరిత.



- చెరుకు మహేశ్వర శర్మ,
రాయికల్, జగిత్యాల



















## చెడుపై విజయమే

# విజయదశమి

**నవరాత్రి పదంలో నవ శబ్దం తొమ్మిది సంఖ్యను సూచిస్తుంది. నవరాత్రులను నవ అహోరాత్రాలు అని ధార్మిక గ్రంధాలు వివరిస్తున్నాయి. అంటే తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు నిర్వర్తించే దేవి పూజకు ఒక ప్రత్యేక విధానం ఉంది. ఆశ్వయుజ శుక్ల పక్ష పాడ్యమి తిథి నుండి పూర్ణిమ వరకు తొమ్మిది రాత్రులు తొమ్మిది పగళ్ళు అమ్మవారిని పూజించడం ప్రశస్తంగా చెప్పబడింది. దీనినే 'శరన్నవరాత్రులు' లేదా 'దేవి నవరాత్రులు అంటారు.**

నవరాత్రి వాస్తవానికి ఋతువుల సంధికాలం. అందుచేత సృష్టికి కారణమైన మహా మాయ తీవ్రవేగం కలిగి ఉంటుంది. పూజాదుల చేత ఆమెను ఆహ్వానించటం సులభ సాధ్యం. తొమ్మిది రోజులు నవ దుర్గలను నిష్ఠగా ఉపాసించే ఆరాధకులకు దేవి అనుగ్రహం లభిస్తుంది. నవ రాత్రులలో రాహుకాల వేళ రాహుకాల దీపం వెలిగించాలి. రాహు ప్రతికూల ప్రభావం తగ్గి, దోష నివారణ జరుగుతుంది. దేవి అర్చనలో లలితా సహస్రనామాలు, దుర్గాసప్తశతి పారాయణ చేసే భక్తుల కోరికలు నెరవేరుతాయి. రోగ పీడలతో బాధపడే వారు, జాతకంలో అపమృత్యు దోషం ఉన్నవారు ఈ తొమ్మిది రోజులు నియమం తప్పకుండా దేవి ఆరాధన చేయడం శుభకరం.



సాధారణంగా విజయ దశమి నాడు శ్రవణ నక్షత్రం ఉంటుంది. నక్షత్ర మండలంలో శ్రవణ నక్షత్రం చెవి ఆకారంలో ఉంటుంది. అందుకే ఈరోజు ఏదైనా కొత్త విద్యలు నేర్చుకోవాలనుకొనేవారు ఈరోజు ప్రారంభిస్తే విశేషంగా లాభిస్తుంది. శమీ చెట్టు యొక్క పూజ ఈ రోజు విశేషంగా లాభిస్తుంది. జమ్మి చెట్టును పూజించడం లక్ష్మీప్రదమని పురాణాలు చెబుతున్నాయి. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయ దశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన



స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుంది.

పరమ శివునికి జగన్మాత దుర్గాదేవికి, సిద్ధి ప్రదాత గణపతికి శమీ పత్రి సమర్పించే ఆచారం అనాదిగా వస్తోంది. పూర్వం జమ్మి చెట్టు కాడల రాపిడి ద్వారా సృష్టించిన అగ్నితోనే యజ్ఞ యాగాదుల క్రతువులు నిర్వహించేవారు. ఇవాల్టికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో శమీ వృక్షంలో అగ్ని ఉంటుందనే విశ్వాసం దృఢపడింది. అగ్ని వీర్యమే సువర్ణం కనుక జమ్మి బంగారం కురిపించే చెట్టుగా పూజార్హత పొందింది. ఈ రోజే శ్రీ రాముడు రావణునిపై విజయం సాధించాడు. విజయదశమి రోజునే శమీ పూజ కూడా నిర్వహిస్తారు.

శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది. సామాన్యులే గాక యోగులు నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ముఖ్యంగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. ఆలయాలలో అమ్మవారికి విశేష అలంకరణలు, బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేసి, పూజిస్తారు. అమ్మవారు లోక కళ్యాణం కోసం ఒక్కోరోజు ఒక్కో అవతారం ధరించింది. అందువలన అలా అమ్మవారు అవతరించిన రోజున, ఆ రూపంతో అమ్మవారిని అలంకరించి ఆ నామంతో ఆరాధిస్తూ ఉంటారు.



**– రామకిష్టయ్య సంగన భట్ల...9440595494**




# ఆయన అవిశ్రాంత ఉపాధ్యాయుడు



**- ఆధ్యాత్మిక చింతనా పరుడు**
**- సాహితీ అభిమాని**
**- హాస్య రచయిత**

ఆయన అవిశ్రాంత ఉపాధ్యాయుడు ప్రభుత్వ ఉద్యోగిగా పదవి విరమణ అనంతరం రామా, కృష్ణ అనుకుంటూ ఇంటికే పరిమితం కాకుండా, తనవంతుగా సమాజానికి ఎంతోకొంత హితం చేయాలనే భావన తో ఆయన ఆధ్యాత్మిక రచనలకు శ్రీకారం చుట్టాడు. ఆయన ఎవరో కాదు ఎనిమిది పదులు దాటిన యువ వృద్ధుడు ఆయనే జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కల్లపల్లి గ్రామంలో జన్మించిన ముదుగంటి వెంకటనర్సింహారెడ్డి ఉపాధ్యాయ జీవితాన్ని గడిపి పదవి విరమణ అనంతరం జగిత్యాల జిల్లా కేంద్రంలో తెలుగు పండిత శిక్షణ కళాశాల ను ఏర్పాటు చేసారు. ప్రస్తుతం ఈ కళాశాలల్లో శిక్షణ పొందిన ఎందరో శిక్షణార్థులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. అక్కడికే సంతృప్తి చెందకుండా నాలుగు వేదాలను ఉపనిషత్తులను జోక్స్ బ్యాంకు జోక్స్ టానిక్ పుస్తకాలను ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఎందరో వర్ధమాన



రచయితలకు పుస్తక ముద్రణకు తనవంతుగా ఆర్థికంగా సహాయం అందిస్తూనే సత్కారాలు నిర్వహిస్తున్నారు. అంతేగాకుండా జగిత్యాల జిల్లా కేంద్రంలో శ్రీ లక్ష్మీ నరసింహారావు బీఈడీ కళాశాల స్థాపించి అవిశ్రాంతంగా విద్యాసంస్థల నిర్వహణతో పాటు సామాజిక సేవలో భాగంగా తెలుగు భాష పై కలిగిన మక్కువతో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘాన్ని స్థాపించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎందరో రచయితలను ఆహ్వానించి హితోదికముగా సత్కారాలు నిర్వహిస్తున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా సరళ భాషలో రాసిన నాలుగు వేదాలను



నర్సింహారెడ్డి ఎం వి.




యూట్యూబ్ లో ఉంచి ఆధ్యాత్మిక సేవలను కొనసాగిస్తున్నారు. కేవలం తెలుగు భాష పైనే మక్కువ కాకుండా జాతీయ అంతర్జాతీయ భాషలైన హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సైతం హాస్య రచన పుస్తకాలను తర్జుమా చేయించి వివిధ పాఠశాలలకు, గ్రంథాలయాలకు, ఉచిత పంపిణీ చేస్తున్నారు. విద్యార్థి దశలో ఆయన 11వ తరగతి చదువుతున్న ఆ సమయంలోనే పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్దు రామకృష్ణయ్య ప్రోత్సాహంతోనే "ప్రేమ జీవులు ఆదర్శ త్యాగాలు" సాంఘిక నవల తొలి సారి రాశారు. దీనికిగాను ఆయన రచనను ప్రోత్సహించడానికి పాఠశాల అప్పటి ప్రిన్సిపల్ 25 తులాల వెండి జ్ఞాపికను నరసింహా రెడ్డి కి బహుమతిగా అందజేశారు. ఈ నేపథ్యం స్ఫూర్తితో ఉద్యోగ విరమణ అనంతరం సైతం వివిధ ఆధ్యాత్మిక పుస్తకాలతో పాటు బీఈడీ కళాశాల కు సిలబస్ కు సంబంధించిన అలంకారం భాషా శాస్త్రం పుస్తకాలను సైతం ముద్రించారు. వేదాలతో పాటు మహాభారతం, రామాయణం, భాగవతం, బ్రహ్మ సూత్రాలు,వంటి 32 పుస్తకాలు సామాన్యులకు అర్థమయ్యే భాషలో రచనలు చేశారు. తెలుగు భాష సంరక్షణ కొరకు తెలంగాణ ప్రాంతము రచయితలతో సాహితీవేత్తల తో సెమినార్లు నిర్వహించి ఉగాది పండుగ సమయంలో కవి సమ్మేళనాలు నిర్వహించారు. యువ రచయితలకు ఆర్థిక సహాయం అందిస్తూ సాహితీ సేవ లోను ముందుంటున్నారు.

**బాల్య మిత్రుడిని సాంగత్యంతో.....**

జగిత్యాల పట్టణంలోని ప్రముఖ విద్యావేత్త,పారిశ్రామిక వేత్త అయిన కాసుగంటి సుధాకర్ రావు గారితో సహ పాటీగా విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పుణికి పుచ్చుకొని భావి జీవితంలో సామాజిక సేవలోనూ పని చేయడానికి జగిత్యాల పట్టణంలో రోటరీ క్లబ్ నిర్వహణలో కాసుగంటి సుధాకర్ రావు తో పాటు సామాజిక సేవలు కొనసాగించారు. అక్కడికే సంతృప్తి చెందకుండ విద్యారంగంపై తమకున్న అనుభవము, మక్కువ దృష్టిలో ఉంచుకొని జగిత్యాల పట్టణంలో నడిబొడ్డున భారతీయ నాగరిక విద్యా సమితి ఏర్పాటు చేసి అనుబంధం గా శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రారంభించి ఇంతింతై వటుడింతై అన్నట్లుగా తెలుగు మాధ్యమంతో ప్రారంభించబడి సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఇంగ్లీష్ మాధ్యమములో శ్రీ సరస్వతి శిశు మందిర్ డీజి ప్రారంభించి సొంత భవనం అన్ని హంగులతో నిర్వహణ కొనసాగిస్తూనే శ్రీవాణి సహకార జూనియర్ కళాశాల



స్థాపించి శ్రీ కాసుగంటి సుధాకర్ రావు గారికి మిత్రునిగా విద్యా సంస్థ అభివృద్ధిలో తన వంతు కృషి సల్పి నాడు. ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం పొందినారు. సాహిత్య సేవలకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా నగదు పురస్కారముతో సత్కరించబడ్డారు.

**-సిరిసిల్ల**
**రాజేందర్ శర్మ**



**గుండె లోతుల్లోంచి వొచ్చే పాట. కరుడు గట్టిన హృదయాలను కరిగించే బలమైన తూటా... రాగలాపన హృదయ అంచుల్లోకి చొచ్చుకోనిపోతుంది..... అది పాటకున్న మహత్తరమైన శక్తి.**

**ప్రవహించేది పాట... పరవళ్ళు తొక్కెది పాట..**

**వికాసం పాట.... విజ్ఞానం పాట.... ఇలా మానవ జీవితం అంతర్భాగం పాట....**

**కోకిల గానం నచ్చనివారు వుండరు. అలాగే జనగామకు చెందిన సుమధుర గాయని, తెలంగాణ గాన కోకిల వుప్పల వసంత పాట అంతే... ఏ పాట పాడిన ఆ....నోట ఈ.... నోట అందరిది... అదే మాట... పండితులైన పామరులైన ఫిదా కావల్సిందే....ఆమె గొంతులో పాట తేనెలూరు ఊట.....**



## సుమధుర గాయని తెలంగాణ గాన కోకిల

# వుప్పల వసంత



జనగామ జిల్లా వెంకన్నకుంటకు చెందిన వుప్పల నాగభూషణం, శశిరేఖ దంపతులకు జన్మించారు. విద్యాభ్యాసం ఎం.ఎ,టిపిటి, బి.ఇడి పూర్తి చేశారు. ప్రస్తుతం యుపిఎస్ పాఠశాల యశ్వంత పూర్‌లో తెలుగు పండిట్‌గా వృత్తి చేస్తున్నారు. ప్రవృత్తిగా కళారంగాన్ని ఎంచుకున్నారు. జనగామ జిల్లాలో చక్కని గాత్రం కలిగి పాటలు పాడే గాయనీగా ప్రజలకు సుపరిచితురాలు.

కళారంగంలో అమ్మ తొలి గురువు అమ్మ అప్పుడప్పుడు పాడే పాటలు చిన్నతనం నుండే గమనించేది . అమ్మతో కలిసి పాటలు పాడుతూ సంతోషిస్తు వుండేది. సంగీతం నేర్చుకోలేదు కాని నిరంతర సాధన ఆమెలో ఏకలవ్యుని స్మరణ తెస్తుంది. అదే తర్ఫీదుగా అభ్యాసంగా మారింది.

భర్త, ఉపాద్యాయులు నల్లనాగుల రాజు ప్రోత్సాహంతో గాయనీగా కళా రంగంలో నిలదొక్కుకుంది.

**"పంట చేల గట్ల మీద నడవాలి"**
**"కొమ్మ మీద కోయిలా కమ్మగ కూస్తున్నది"**
**"ఓహొ ఓహొ వసంతమా."**
**"ఆకాశ సంద్రనా వెన్నెల నావెక్కి"**
**"నందూరి రాగంలో వేటూరి గానం లో."**

"శ్రీ గణనాథ ఓ గజవదనా" లాంటి ఎన్నో పాటలు వసంత నోట వింటే మాన సిక ఉల్లాసం ఉత్సాహం కలుగుతుంది.

తెలంగాణ ఉద్యమ పాటలు, సామాజిక అంశాలపై చైతన్య గీతాలు, గజల్స్, భక్తి గీతాలు, భజనలు, బతుకమ్మ పాటలు వసంత అలవోకగా పాడి ప్రేక్షకులను రంజింపజేయడంలో ఆమెకు సాటిలేరు. జనగామ విద్యాశాఖ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు.

లయన్స్ క్లబ్ జనగామ, లయన్స్ క్లబ్ ఆబాద్,లయన్స్ క్లబ్ మిలీనియం, అవోపా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు. సావిత్రీబాయి పూలే ప్రతిభా పురస్కారం.

ప్రపంచ తెలుగు మహాసభలు కార్యక్రమంలో పాటలు పాడి జనగామ కీర్తిని ఇనుమడింప జేశారు. కృత్యమేళా ప్రదర్శనలో పాల్గొన్నారు. జనగామ జిల్లాలో పలు సాహిత్య,కళా ,విద్యా సంబంధించిన సమావేశాల్లో పాల్గొని సందర్భోచితంగా పాటలు పాడి ప్రజలను చైతన్యవంతం కోసం నేటికి నిరంతరంగా కృషి కొనసాగి స్తున్నారు. అనేక మంది కవులు రచించిన పాటలకు స్వంతంగా స్వరాలను సమకూర్చి ఆలపించడం వసంత ప్రత్యేకత.



ప్రతిభా పురస్కారం. స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు.

జనగామ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘము "తెలంగాణ గాన కోకిల" బిరుదు ప్రధానం చేసి ఘన సత్కరించారు.

మలి విడత తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని ఉద్యమగీతాలతో ప్రజ లను ఉత్తేజం నింపారు. జనగామ జెఎసి కన్వీనర్ కన్న పరశురాములు సారథ్యంలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జన గామ జిల్లా సాధన ఉద్యమంలోను గళం విప్పి అస్తిత్వ పోరు బాటలో భాగస్వామ్యం పొందారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,బిసి కమీషన్ చైర్మన్ బి.ఎస్.రాములు లాంటి ఎందరో ప్రముఖులచే సన్మాన సత్కారాలు అందుకున్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ పెర్ఫార్మింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ అవిర్భావ సదస్సులో జనగామ గడ్డ కళామ తల్లి ముద్దుబిడ్డ వసంత పాటలు అనాటి కార్యక్రమానికి ఉత్తేజం కలిగించింది.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ అష్టాలక్ష్మీ సుస్వరా కవన గానాలాపన అమృతవర్షిని జయరాజ్,దూబగుంట రామకృష్ణ, చల్లా శివారెడ్డి, పద్మ త్రిపురారి, వి.నారాయణ, ఆవేర,సస్యశ్రీ, మాధవరావు, సుజాత, గదాధర్,వేణుగోపాల్, అభిరామ్ ,చంద్రశేఖరశర్మ లాంటి ఎందరో తెలంగాణలోని కవులు,కవయిత్రిలు రాసిన ఎన్నో పాటలు స్వరకల్పన చేసి స్వీయ గానం చేశారు.

కె.కె. మ్యూజిక్ జనగామ రూపొందించిన బత్రుకమ్మ,దీపావళి వీడియో ఆల్బమ్స్ లో నటించి పాటలు పాడి దృశ్యశ్రవణ రంగాల్లోను తన ప్రతిభను నిరూపించుకున్నారు.

తను పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థులకు పాటలు,పద్యాలు నేర్పించి నిష్ణాతులుగా చేయాలని, మరెన్నో ప్రయోగాత్మకమైన పాటలు పాడి అబాలగోపాలన్ని అలరించి చైతన్యం చేయాలని ఆశిద్దాం.



**- గుడికందుల కృష్ణ**
**9440 97330**

# ఈటెల తలపై... తెరాస వామన పాదం?



రాజకీయాలలో తమ పరభేదం అంటూ ఏది ఉండదు. గెలిచే గుర్రానికే విలువ ఎక్కువ. తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన వారికన్నా, రాజకీయాలలలో ఓట్లు రాబట్టగలిగే తెలివి, సామర్థ్యం, చాణక్యనీతి అనే మోసపూరిత రాజకీయ చతురతకే ప్రాధాన్యత ఎక్కువ. ప్రజలు కూడా తమకు సేవ చేసే వారికన్నా, తాత్కాలిక అవసరాలకు అనుగుణంగా మెదిలే నాయకుల ప్రాధాన్యం ఇస్తున్నారు. వారినే నిజమైన నాయ్కులుగా ఆరాధిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమ కాలంలో అనేక సార్లు శాసన సభ్యత్వాలకు రాజీనామాలు చేసి ప్రజా క్షేత్రంలో పోటీపడ్డ అనేక మంది ఉద్యమ కారులు ఓడిపోయారు. తెలంగాణ ఉద్యమం ఎంతో వేడిగా, ఆవేశంగా కొనసాగుతున్న కాలంలో కూడా ఇలానే జరిగింది. కానీ ఉద్యమం ఆగలేదు. ఎంతో మంది రాజకీయ నాయకులు పార్టీలు మారారు. ప్రజా ఉద్యమం కొనసాగుతూనే ఉంది.

తెలంగాణ ఏర్పడ్డ ఈ 7 సం. లలో ఎన్నో ఆటుపోట్లు. ఐనా, రాజకీయంగా ఉద్యమ పార్టీ తెరాస అధికారంలో కొనసాగుతూనే ఉంది. రాజకీయాలలో విమర్శలు, ప్రతి విమర్శలు పరిపాటి. రాజకీయ పార్టీలలో ఉన్న వారు బయటకు వెళ్ళడం, కొత్తవారు చేరడం సహజమే. ఈ రాజకీయ అనంత ప్రయాణంలో కొత్తగా ఇప్పుడు, పార్టీలో ఎంతో గౌరవనీయుడుగా, ఉన్నతుడుగా ఉన్న ఈతల రాజేందర్ కు అధిష్టానానికి మధ ఏర్పడ్డ రాజకీయ అగాధం వల్ల పార్టీ వీడి, తన జీవితకాలం అంతా వ్యతిరేకించిన సిద్దాంతాలనే నమ్ముకొన్న బిజెపిలో చేరడం, శాసన సభ్యత్వానికి రాజీనామా చేయడం, ఉప ఎన్నికలు రావడం జరిగిపోయింది.

తెరాసకు ఒక వ్యక్తి, ఒక నాయకుడు పార్టీ విడిపోవడం కొత్తకాదు. ఆమాటకొస్తే, ఏ రాజకీయ పార్టీకైనా ఇది సహజమైనదే. కానీ పార్టీ అధిష్టానికి వ్యతిరేకంగా, ఆత్మగౌరవం అంటూ, పార్టీలో ఉన్నపుడు కూడా సంచలన వ్యాఖ్యలు చేసిన ఈటల రాజేందర్, ఆయన తూటాల్లాంటి మాటలకు అంతకంటే వాడిగా, వేడిగా జవాబిచ్చిన తెరాస నాయకుల మాటలు మాత్రం ప్రజలలో కొంత కాలం పాటు వినోదాన్ని పంచాయి.

పోయిన నాయకుని గురించి, ఆయన స్థాయిని గురించి కానీ అనవసరంగా తెరాస ఎక్కువగా ఊహించుకొని, ఆయన రాజకీయ జీవితాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించింది. ప్రయత్నిస్తుంది. తెరాస పంతం, ఈటలను జాతీయ నాయకునిగా చేస్తుంది. తెరాసకు ఇది అనవసర తలనొప్పిగా మారదమే కాకుండా, హుజూరాబాద్ లో జరిగే ఉప ఎన్నికను ప్రత్యేకంగా, ప్రభుత్వ ప్రతిష్టకు నిదర్శనంగా తీసుకోవడం విశ్లేషలకులకే కాదు సామాన్య ప్రజలకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అసెంబ్లీలో ఉన్న 119 స్థానాలలో వందకు పై స్థానాలు ఉన్న తెరాసకు, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఈటల నెగ్గడం వల్ల కలిగే రాజకీయ నష్టం కానీ, ప్రభుత్వానికి వచ్చే ఈబ్బంది కానీ ఏమి లేదని అందరికీ తెలుసు.



మొన్న దుబ్బాకలో కానీ, ఆతరువాత జీ హెచ్ ఏం సి లో కానీ బిజెపి కొంత ఆధిక్యాన్ని చూపినా, ఆతరువాత జరిగిన నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో చితికిల పడింది. మరి ఎందుకు తెరాస హుజూరాబాద్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకొంటూ, పదుల సంఖ్యలో శాసన సభ్యులను, మంత్రులను అక్కడే ఉంచి ప్రఃకారం కొనసాగిస్తుందో సామాన్యులకు అర్థం కావడం లేదు. పార్టీని వీడిన వారికి ఏ పార్టీ అండ దొరికినా, తెలంగాణ ప్రజలు ఆదరించారనే సందేశం ఇవ్వాలని ప్రయత్నిస్తున్న తెరాస అధినాయకత్వం ఆలోచనలకు ప్రజలు ఎంతగానో సహకరిస్తున్నారనే వారు నమ్ముతున్నారు. ■






# శమయతే పాపం...

# శమీ వృక్ష ప్రత్యేకత

**శమీ శమయతే పాపం, శమీ శత్రు వినాశినీ, అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శినీ, ' ...భారత, రామాయణాది పౌరాణిక గాథలలో శమీ వృక్షానికి విశేష ప్రాధాన్యత కల్పించ బడింది. శమీకే "అపరాజిత " అనిపేరు. అంటే ఓటమి నెరుగని మాతయని అర్థం. అమెయే విజయ, నామాంకితయైన జగజ్జనని, అపరాజితా దేవి. విజయానికి అధిదేవత.**



శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా, దుర్గా మాతను తొమ్మిది రోజులుగా కొలిచి నట్లయితే సర్వ శక్తులు సమకూరి, విజయ దశమినాడు విజయం చేకూరగలదని భక్తుల, ఆధ్యాత్మిక కార్యానురక్తుల ప్రగాఢ విశ్వాసం. అందులకై దసరా నవరాత్రి ఉత్సవాలలో ముగింపుగా విజయ దశమి పర్వ దినాన శమీ (జమ్మి) వృక్షాన్ని పూజించి, సర్వాభీష్ట సిద్ధికై ప్రార్థించడం ప్రాచీన కాలంనుండి అనుసరిస్తున్న సత్సాంప్రదాయం. పూర్వకాలంలో రాజులు తమ విజయ యాత్ర సన్నాహక కార్యక్రమాలుగా ' ' అగ్నిపూజ, గుర్రాలు , ఎనుగులు ' ' మొదలైన వాటికి కొన్ని అర్చనలు చేయడాన్ని ఆచరించారు . దానిలో భాగంగానే శమీవృక్ష పూజ చేసి, యుద్ధానికి వెళ్ళేవారు. సంబంధిత కొన్ని విశేషాలను కాళిదాసు రఘువంశ మహా కావ్యమందు నాలుగవ సర్గలో సూచించారు. యజ్ఞ యాగాదులలో ఉపయుక్త శ్రౌతాగ్నిని మథించుటకై , జమ్మికొమ్మ అవసరమైంది.

అరనులలో ఆడుగు కర్ర జమ్మికర్ర. పై కర్ర రావి కర్ర వాడతారు. జమ్మిని స్త్రీ లింగం గా, రావిని పుం లింగంగా ( శమింతా, అశ్వత్థ:) అని ఆర్యులు పేర్కొన్నారు. అగ్ని శమీ గర్భాన కలదని ( శమీ గర్భా దగ్నిం మంద తి) అని శ్రుతి వచనం, కనుకనే శమీ పూజకు ప్రాధాన్యత ఏర్పడింది. విజయ దశమి నాడు శమీవృక్షాన్ని పూజించే క్రమంలో రామార్జున గాథలను స్మరించే సంప్రదాయం ఉంది. రాముడు , రావణునిపై విజయం సాధించిన దినంగా , పాండవులు వనవాసం వెళుతూ, శమీవృక్షం పైనుండి తమ ఆయుధాలను తిరిగి పొంది కౌరవులను జయించిన దినంగా విజయ దశమికి ప్రత్యేకత ఉంది. అర్జునినితో కూడిన పాండవులు అజ్ఞాత వాసం వెళ్ళే సమయాన తమ అస్త్ర శస్త్రాలను శమీ వృక్షంపై నిక్షేపించినట్లు భారత కథనం. శమీవృక్షం లేదా జమ్మి చెట్టు లను మాగ్నోలియో పైటా తరగతికి, ప్రోసో పిస్ జాతికి , ఫాబేసి కుటుంబానికి చెందినది. దీని శా స్త్రీయ నామం ప్రోసోపిస్ సైసిజెరా. వైదిక భాషలో "ఆరణి" అని పిలుస్తారు. అగ్నిని ఉద్భవించేందుకు కాష్టాంతరంచే మథింప యోగ్యమైన దారువు అని "ఆరణి" ' అర్థం. జమ్మి ఆకుల పసరు తీసి, పుళ్లకు రాస్తే కుష్టు వ్యాధి నశిస్తుందని, జమ్మి పూలను చక్కెరతో కలిపి సేవించడం వల్ల గర్భ స్రావం కాకుండా నిరోధించ బడుతుందని , జమ్మి చెట్టు బెరడు దగ్గు ఆస్తమా వ్యాధులకు ఔషధంగా పని చేస్తుందని ఆయుర్వేద వైద్యులు చెపుతారు. విజయ దశమి సాయంత్రం శమీవృక్షం వద్ద ఆపరా జితను పూజించి "శమీ శమయతే పాపం శమీ లోహిత కంటకా , ధారిణ్య అర్జున బాణానాం రామస్య ప్రియ వాదినీ , కరిష్యమాణ యాత్రాయాం యథా కాలం సుఖం మయా , తత్ర నిర్విఘ్న కర్తీత్వం భవ శ్రీరామ పూజితే," అని చిట్టీలపై రాని జమ్మి చెట్టు కొమ్మలకు తగిలిస్తే, దీని వల్ల అమ్మవారి కృపతో పాటు శని దోష నివారణ కాగలదని విశ్వాసం. మహారాష్ట్రులు శమీ వృక్షానికి తోడు పలాశ (మోదుగ) పత్ర పూజా చేస్తారు. హిందువు ల శుభా శుభ కర్మలలో మోదుగ ప్రమేయం అధికం. ఉపనయనాలో వటువులు భిక్షా సమయాన ధరించేది పలాశ దండం, కాశీకి వెళ్ళి వచ్చిన నైష్టికులు మోదుగ ఆకుల విస్తళ్ళలో నే భోజనం చేసే వారు. పలా శప త్రాలను పోలిన బంగారు చిన్నచిన్న ఆకులను చేయించి , దేవు శృకు , స్నేహితులకు , బంధువులకు ఇవ్వడం విజయ దశమినాటి మహా రాష్ట్ర ప్రజల ఆచారం.



**– రామ కిష్టయ్య సంగన భట్ల...**














## సాంస్కృతిక సారథిగా...

# సృష్టి బతుకమ్మ

-సిరిసిల్ల రాజేందర్ శర్మ

**తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచంలోని నలుమూలలా వ్యాపింప జేయాలన్న సంకల్పంతో అత్యంత వైభవోపేతంగా, కళాత్మకంగా నిర్మించిన పాట - "బృందావనం - సృష్టి బతుకమ్మ".**




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మన సంస్కృతి, సంప్రదాయాలు ఖండాంతరాలు దాటి వివిధ దేశాల్లో నివసిస్తున్న మన ప్రవాసీ తెలుగు వారికి చేరాయి. తత్ఫలితంగా జరిగిన వినూత్నమైన ప్రక్రియ ఇది.

అమెరికాలోని చికాగో మేషిగాన్‌లో పుట్టి పెరిగిన, తెలంగాణ అమ్మాయి మన ఆట పాటలను ఆసక్తిగా నేర్చుకొని, ఒక సరికొత్త సాంస్కృతిక పరంపరకు నాంది పలికింది.

తాను మన బతుకమ్మ సంప్రదాయాలను నేర్చుకోవడమే కాకుండా, అక్కడి ప్రజలందరికీ మన తెలంగాణ పాటను, ఆటను ఈ బతుకమ్మ పాట ద్వారా పరిచయం చేసింది. మాతృదేశ సంస్కృతిని దశ దిశ లా చాటి చెబుతానని తెలిపింది. ఈ పాట యొక్క నిర్మాణం మన జగిత్యాలలో జరగడం కొసమెరుపు. స్థానిక కొండగట్టులోని, బృందావనం రిసార్ట్ అధినేతస్వతహాగా కళాకారుడైన, ఎం.కొండల రావు నిర్మాతగా వ్యవహరించగా, జానపద పరిశోధకుడు డా. లింగా శ్రీనివాస్ తన రచన మరియు నృత్య దర్శకత్వం చేయగా చికాగో నుండి సృష్టి చిల్లా గానం చేయగా జగిత్యాల నుండి డా. లింగా శ్రీనివాస్ శిష్య బృందం నృత్యం చేశారు. ఇందులో ముఖ్య నాయికగా డా. సుష్మా తేజ తన అభినయంతో ఈ పాటతో అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సాంస్కృతిక పునరుజ్జీవనం కేవలం కళ విద్యతోనే సాధ్యమని, కళాకారులను అభినందిస్తూ భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలవకుంట్ల కవిత ఆశీర్వదించారు.







NEST MAKERS
BUILDERS AND DEVELOPERS
NEST MAKERS
BLISS
IN THE
WOODS
Your Dream Projet along the Nature
బతుకమ్మ, దసరా పండుగల శుభాకాంక్షలు
90% Close to
Education,
10% Away
from Home
6 mins away from
schools and
institutions.
High-end Luxury Villas and Plots.
300 sq. yrd. to 1000 sq. yrd.
Self-sustainable Community.
15 mins away from IT Hub and Airport.
Behind Jungle Camp,earPedda Golkondan
+91 63669 63669 | www.nestmakers.in